నిరుద్యోగులకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అశోక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించాలని డిమాండ్ చేస్తు నాలుగు రోజులుగా ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన నిరుద్యోగి అశోక్‌ను గురువారం పోలీసులు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అశోక్‌ను పరామర్శించి అతనికి అందుతున్న వైద్యసేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రూప్ 1పరీక్షల్లో జరిగిన అవకతవకల్లో ప్రభుత్వం వైఫల్యం కారణంగా సంవత్సర కాలంగా నష్టపోతున్న విద్యార్థి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరుద్యోగులు చేపడుతున్న ఆమరణ నిరహార దీక్షను దృష్టిలో పెట్టుకుని తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ పాల్గొన్నారు.

'రేషన్‌కార్డుల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం'



ఏఎస్ఓకు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట సర్కిల్ పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అర్హులైన పేద ప్రజలకు రేషన్‌కార్డుల మంజూరులో కాలయాపన జరుగుతుందని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వర చర్యలు తీసుకోవాలంటూ గురువారం మలక్‌పేట సర్కిల్ ఏఎస్ఓ నర్సింగ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్‌కార్డులు ఆలస్యమవుతుండటంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.



బతుకమ్మ ఘాట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తదితరులు

బతుకమ్మ ఘాట్‌లో పనులు పూర్తిచేయండి

సైదాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువు బతుకమ్మ ఘాట్‌ను గురువారం ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి బతుకమ్మ ఘాట్‌ను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చిలుకూరి రాంరెడ్డి, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం



విద్యార్థికి స్కూల్ బ్యాగు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి, పరమేశ్‌కుమార్

సైదాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి అన్నారు. గురువారం లక్కీజెన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ ఆనంద్‌మార్గ్ స్కూల్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లను బీజేపీ రాష్ట్ర నేత సంగోది పరమేశ్‌కుమార్‌తో కలిసి అందజేశారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీం లీడర్ రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రాజ్యలక్ష్మి, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలకు విమలక్క ఆహ్వానం



శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులకు బహుజన బతుకమ్మ ఆహ్వానపత్రికను ఇస్తున్న విమలక్క

మన్సూరాబాద్ : ప్రకృతి రక్షణే.. ప్రజల రక్షణ అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే బహుజన బతుకమ్మ వేడుకలకు రావాలంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను అరుణోదయ కళాకారిణి విమలక్క ఆహ్వానించారు. ఈ మేరకు నాగోల్‌లోని ఆయన నివాసానికి విచ్చేసిన విమలక్క ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఉప్పల స్వప్న దంపతులకు ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం ఉప్పల దంపతులు విమలక్కకు చీరపెట్టి సత్కరించారు.

నాదర్‌గుల్‌లో రజాకార్ సినిమా ప్రదర్శన

● ఆసక్తిగా వీక్షించిన గ్రామస్థులు



రజాకార్ సినిమాను వీక్షిస్తున్న గ్రామస్థులు, బీజేపీ నేతలు

సరూర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ బస్టాండ్‌లో బీజేపీ నేతలు రజాకార్ సినిమాను ప్రదర్శించారు. బస్టాండ్ కూడలిలో వేదిక ఏర్పాటు చేసి యూట్యూబ్ ద్వారా సినిమా ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై సినిమాను వీక్షించారు. ఈసందర్భంగా శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో నాడు రజాకార్లు చేసిన ఆకృత్యాలు, తెలంగాణ సాయుధ పోరాటం గురించి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే గ్రామంలో ఈ సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తెలంగాణకు రజాకార్ల నుంచి విముక్తి లభించిన రోజు కాబట్టే సెప్టెంబరు 17ను విమోచనా దినోత్సవంగా జరుపుకుంటున్నట్టు పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించండి



కార్పొరేటర్ నివాసంలో చింతల సురేంద్రనాథ్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు

మన్సూరాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించాలని టీజీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాగోల్ శాఖ సభ్యులు కోరారు. ఈ మేరకు నాగోల్‌లోని కార్పొరేటర్ నివాసంలో గురువారం ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాగోల్ శాఖ నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాగోల్‌శాఖ అధ్యక్షుడు బీవీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సొంత భవనం లేక నాగోల్‌లోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయింపునకు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో టీజీఆర్‌ఈ అసోసియేషన్ నాగోల్ కార్యదర్శి అశోక్‌కుమార్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.నర్సింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి వి.అశోక్, ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర‌రెడ్డి, ఈసీ మెంబర్ ఎ.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో రూ.2.34లక్షలు గోల్‌మాల్ !

● టెండర్ వేశారు.. నిధులు భోంచేశారు
● పనులు చేయకున్నా బిల్లు చెల్లించిన ఇంజనీరింగ్ అధికారులు
● తాజాగా నామమాత్రంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్



మీర్‌పేట్ నందిహిల్స్‌లోని కమ్యూనిటీ హాల్(పెయింటింగ్‌కు ముందు శనివారం నాటి ఫొటో)



పెయింటింగ్ పనులు మొదలు పెట్టాక కమ్యూనిటీ హాల్(తాజా ఫొటో)

సరూర్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశంలో ఓ పని కోసం తీర్మానం చేశారు.. అనంతరం టెండర్ పిలిచారు.. ఓ కాంట్రాక్టర్‌కు ఆ పని అప్పగించారు.. మూడు నెలల్లో పని పూర్తి చేయాలని ఆదేశించారు.. కానీ ఆరు నెలలైనా పని మొదలుపెట్టలేదు.. బిల్లు మాత్రం 'మూడు' నెలల్లోనే ఎత్తేశారు..! ఈ తతంగం నడిచింది మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో..! కమిషనర్ మొదలుకుని డీఈఈ, ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాకా అంతా కలిసి కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అప్పనంగా రూ.2.34లక్షలు నొక్కేశారు. ఇందులో ఓ మాజీ ప్రజా ప్రతినిధి ప్రమేయం కూడా ఉన్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

జనవరిలో టెండర్.. మార్చిలో వర్క్ ఆర్డర్..

మీర్‌పేట్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్ రోడ్ నం.5లో గల ఐలమ్మ కమ్యూనిటీ హాల్ రిన్నోవేషన్(మరమ్మతుల) నిమిత్తం గతేడాది ఆగస్టు 8వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఇందుకు గాను రూ.2.41లక్షలు ఖర్చవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో టెండర్లు పిలువగా ఓ మాజీ ప్రజా ప్రతినిధికి సన్నిహితంగా ఉండే శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ 3.20శాతం తక్కువకు కోట్ చేసి రూ.2.34లక్షలకు టెండర్ దక్కించుకుంది. ఇది కూడా అంతర్గతంగానే 'మమ' అనిపించేసినట్టు తెలిసింది. అనంతరం ఈ ఏడాది మార్చి 12వ తేదీన మునిసిపల్ కమిషనర్ సదరు కాంట్రాక్ట్ సంస్థకు వర్క్ ఆర్డర్(నం.ఇ1/ఎంఎంసీ-186/2024-25) జారీ చేశారు. ఈ ఆర్డర్ జారీ చేసిన మూడు రోజుల్లోగా పనులు మొదలు పెట్టాలని, మొత్తం పని మూడు నెలల్లో పూర్తి చేయాలని వర్క్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆ లెక్కన మార్చి 15న పని మొదలుపెట్టి జూన్ 15నాటికి పని పూర్తి చేయాలి. కానీ ఇక్కడ ఇంత వరకు అసలు పనే మొదలుపెట్టకపోగా.. సదరు పనికి సంబంధించిన బిల్లు మాత్రం డ్రా చేశారు. సరిగ్గా మూడు నెలలకు.. అంటే జూన్‌లోనే మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు 'చేయని' పనికి ఎంబీ రికార్డు చేసి కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించేశారు. ఓ మాజీ ప్రజా ప్రతినిధితో పాటు ఇంజనీరింగ్ సెక్షన్‌లోని వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈ తతంగం నడిపించినట్టు ప్రచారం జరుగుతోంది. తిలా పాపం తలా పిడికెడు అన్నట్టు ఇందులో అధికారులు సైతం తమ వంతు 'వాటా' తీసేసుకున్నట్టు తెలిసింది. మొత్తం మీద అంతా కలిసి పని చేయకుండానే రూ.2.34లక్షలను స్వాహా చేసేశారు.



హాల్ పక్కన ఉన్న బాత్‌రూమ్ డోర్ పాడైపోయిన దృశ్యం(ఫైల్ ఫొటో)



తాజాగా కొత్త డోర్ బిగించిన దృశ్యం

తాజాగా తూతూమంత్రంగా పెయింటింగ్

ఈ అవినీతి వ్యవహారంపై ఇటీవల స్థానికంగా చర్చ జరగడంతో శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు చెందిన కాంట్రాక్టర్ హడావిడిగా వచ్చి కమ్యూనిటీ హాల్ బాత్‌రూమ్ డోర్ కొత్తది పెట్టి, హాల్‌కు పైపై మెరుగులు అన్నట్టుగా పెయింటింగ్ చేయిస్తుండడం ఇక్కడ గమనార్హం! గత శనివారం వరకు బూత్ బంగ్లాగా కనిపించిన సదరు హాల్ ప్రస్తుతం పెయింటింగ్‌తో కాస్త కొత్తగా తయారయింది. ఇక బాత్‌రూమ్ డోర్‌కు, పెయింటింగ్‌కు కలిపి సుమారు రూ.15వేలు ఖర్చయినట్టు తెలిసింది. ప్రస్తుతం సదరు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. జూన్‌లో పూర్తి కావాల్సిన పనిని ఇప్పుడు మొదలుపెట్టడం ఒక ఎత్తు కాగా.. అప్పుడే బిల్లు డ్రా చేయడం ఇంకో ఎత్తు కావడం గమనార్హం! ఆ లెక్కన 2.34లక్షల మొత్తంలో దాదాపు రూ.2లక్షలకు పైగానే నిధులు భోంచేసినట్టు తెలుస్తోంది. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఇంజనీరింగ్ అధికారులపై, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకే మోదీ సాహసోపేత నిర్ణయాలు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
● రక్తదాన, వైద్య శిబిరాలకు విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పటంలో భారత దేశాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలపడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం యావత్ భారతావనికే గర్వకారణమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా సేవాపక్షంలో భాగంగా గురువారం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో మెగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల విచ్చేసి జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమింగ్‌తో ఎంతో మంది యువత ఆర్థికంగానే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోయారని, దేశ యువతను కబలిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన మహానాయకుడు మోదీ అన్నారు. అదేవిధంగా పేద వర్గాలకు పెను భారంగా మారిన జీఎస్టీని అధిక మొత్తంలో తగ్గించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు. ఇలా మరెన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న ప్రధాని మోదీ ప్రపంచ దేశాలే భారత్ వైపు చూసేలా చేయడం గర్వకారణమన్నారు. ఈ శిబిరంలో సుమారు 230 మంది రక్తదానం చేసినట్లు జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి ఎడ్ల అమరేశ్వర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు బండారి భాస్కర్, బొల్లం యశ్పాల్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, నాంపల్లి రామేశ్వర్, గంగదాసు కృష్ణారెడ్డి, హరీష్‌రెడ్డి, సోమ సీమనాథ్ పాల్గొన్నారు.

21న '3కే నమో యువరన్' పోస్టర్ ఆవిష్కరణ

డ్రగ్స్ రహిత దేశం కోసం బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 21వ తేదీ ఆదివారం 3కే నమో యువరన్‌ను చేపట్టనున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డిలతో కలిసి ఈటల ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద 21న ఆదివారం నిర్వహించే 3కే నమో యువరన్‌లో యువత అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా స్పోక్స్ పర్సన్ సీమ సోమనాథ్ పిలుపునిచ్చారు.

సాయుధ రైతాంగ పోరాటం క్రెడిట్ కమ్యూనిస్టులదే

సరూర్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని, నిజాం పాలకులను తరిమికొట్టిన క్రెడిట్ కామ్రేడ్లకే దక్కుతుందని సీపీఎం నేతలు పేర్కొన్నారు. సెప్టెంబరు 17ను పురస్కరించుకుని బుధవారం రాత్రి మీర్‌పేట్ చౌరస్తాలో సీపీఎం బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుబ్బాక రాంచందర్, జిల్లా కమిటీ సభ్యుడు గోరెంకల నర్సింహ మాట్లాడుతూ కమ్యూనిస్టుల సహకారంతోనే నాటి రైతాంగం బందూకులు చేతబట్టి రజాకార్లను తరిమికొట్టిందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం బాలాపూర్ మండల కన్వీనర్ ఎం.యాదయ్య, సభ్యులు బి.ప్రకాశ్‌రెడ్డి, దాసరి బాబు, శేఖర్‌యాదవ్, యెల్లేశ్, సుంకోజు యాదగిరిచారి, టీవీకే రాజు, ధనుంజయ, వెంకయ్య, కిషన్, మల్లికార్జున్, మోహన్ పాల్గొన్నారు.

బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలి

కొత్తపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి సూచించారు. గురువారం రాక్‌టౌన్‌కాలనీ సువిద్య స్కూల్ నుండి 44మంది విద్యార్థులు రాచకొండ చిల్డ్రన్స్ ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కును సందర్శించారు. వారికి ట్రాఫిక్ రూల్స్ యానిమేషన్ వీడియోలు, రైమ్స్ ప్రదర్శించారు. ఏఎస్ఐ సోమ్‌నాథ్ వారికి వాహన ప్రయాణాల్లో జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా టీటీఐ ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్ మీర్‌పేట బడంగ్‌పేట్, బాలాపూర్‌లలో చౌరస్తాల్లో ప్రైవేటు విద్యా సంస్థల్లో నిబంధనల ప్రాధాన్యతను వివరించారు. 15 అవగాహన కార్యక్రమాల్లో 452 మంది వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు. 44మంది మద్యంప్రియులకు 44మంది కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ ఎస్పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్పీఓ అల్లూరయ్య కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చాదర్‌ఘాట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జి వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి సమీపంలోని మోనా బేకరీ వద్ద 40 నుంచి 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లుగా స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు 108ను రప్పించగా వైద్య సిబ్బంది పరిశీలించి వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, మృతుడికి సంబంధించిన వారు 8712661266 ద్వారా చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



అదృశ్యమైన కనీజ్ భాను

చాదర్‌ఘాట్ : ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధురాలు తిరిగి రాలేదంటూ ఆమె కుటుంబీకులు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. చాదర్‌ఘాట్ కమల్‌నగర్ నివాసి కనీజ్ భాను(65) కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. మొదట్లో బంధువుల ఇంటికి వెళ్లి ఉండవచ్చని భావించిన ప్పటికీ తిరిగి రాకపోవడంతో తప్పిపోయిందంటూ ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగోజిగూడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, బేర బాలకిషన్, దళిత సంఘాల నేతలు

ఎల్బీనగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లింగోజిగూడ చౌరస్తాలో ఆకతాయి చేతిలో ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం స్థానంలో నూతన విగ్రహ ఏర్పాటు కోసం గురువారం భూమిపూజ చేశారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహం విధ్వంసం తర్వాత దళిత సంఘాల నేతలు ఆందోళనకు దిగడంతో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డిలు వారితో మాట్లాడి శాంతింపజేసిన విషయం విదితమే అనంతరం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపి ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం స్థానంలో నూతన విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. గురువారం దళిత సంఘాల నేతలతో పాటు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ ఈఈ కార్తీక్ లింగోజిగూడ చౌరస్తాను పరిశీలించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి స్థానికుల సూచనలను పరిగణలోకి తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించిన అనంతరం అధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకోనున్నారు. కాగా గురువారం ఉదయం తొలుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లింగోజిగూడ చౌరస్తాకు చేరుకుని విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం కొద్ది సేపటికి కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి దళిత సంఘాల నేతలతో కలిసి నూతన విగ్రహాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్, లింగోజిగూడ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కామిల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి జగదీష్, నాగరాజ్, అశోక్, చౌదరి పెంటయ్య, ఆనంద్‌రాజ్, పార్శపు శ్రీధర్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, దళిత సంఘాల నేతలు

మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలి

సంతోష్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా మూసరాంబాగ్ కృష్ణ తులసీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మోదీని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని కార్తీకరెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మున్ముందు స్వచ్ఛభారత్, చిత్రలేఖనం పోటీలు, నమో మారతాన్, కిషాన్‌మోర్చా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, నవీన్‌కుమార్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం



భవానీ(ఫైల్)

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన సరూర్‌నగర్ చెరువు వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పొల్లా భవానీ(28) అనే మహిళ పదేళ్ల క్రితం సాయికుమార్ అనే సెంట్రీ ఉద్యోగిని పెళ్లి చేసుకుంది. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఐదు రోజులుగా సాయికుమార్ మరొకరితో ఉంటున్నాడని వార్తలు రావడంతో మానసిక ఆందోళనకు గురైన భవానీ కల్లు తాగుతూ భర్తతో వాదిస్తుండేది. కాగా, ఈ సమస్యపై ఈనెల 16న సైదాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో వారికి కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ పరిస్థితి సద్దుమనగలేదు. ఈ క్రమంలో గురువారం తాను 'చనిపోతానని' భర్తకు చెప్పి సరూర్‌నగర్ చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది భవానీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



మలక్‌పేట న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ వద్ద వరద నివారణకు చర్యలు చేపడుతున్న మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు

మలక్‌పేటలో జలమయమైన రోడ్లు

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గురువారం కురిసిన భారీ వర్షానికి మలక్‌పేటలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మలక్‌పేట అక్షయ్ హోటల్ లేన్, న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ రోడ్డుపై మోకాలి లోతు వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.అశోక్‌కుమార్ తన సిబ్బందితో చేరుకుని వరద నివారణకు తాత్కాలికంగా మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించడం, వరద నీరు పోయేలా చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.



షాపులో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జిల్లెలగూడలో చెప్పుల షాపులో అగ్నిప్రమాదం

● షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి
● రూ.25లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు అంచనా

సరూర్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ చెప్పుల షాపు పూర్తిగా తగలబడి పోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. కోనేరు శ్రీనివాస్ అనే వ్యాపారి కొంత కాలంగా జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ భవనంలో శ్రీశ్రీ ఫుట్‌వేర్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పది గంటలకు షాపు మూసేసి తాళాలు వేసి వెళ్లారు. కాగా గురువారం ఉదయం 7గంటలకు షాపు శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్ లోపలి నుంచి పొగలు రావడం గమనించి శ్రీనివాస్‌కు ఫోన్ చేశారు. వెంటనే ఆయన షాపు వద్దకు చేరుకుని పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని రెండు, మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదం కారణంగా అక్కడ దట్టమైన పొగలు అలుముకోవడంతో ఇతర షాపుల యజమానులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్టాకు విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని యజమాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇతర సామగ్రితో కలిసి రూ.25లక్షల ఆస్తినష్టం జరిగిందని ఆయన వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.